# కర్మఫలం రేగాను వెంటాడింది

- రేగా మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉన్నాయి
- జన జాతర సభ విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు
- కాంగ్రెస్ పినపాక మండల అధ్యక్షుడు గోడిశాల రామనాథం



**పినపాక, ఏప్రిల్07(కెరటం ప్రతినిధి)**

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ మొత్తం ఖాళీ అయిందని, పొంగులేటి శబదం నేడు నిజమయిందని కాంగ్రెస్ మండల అధ్యక్షులు గోడిశాల రామనాథం అన్నారు. ఆదివారం పినపాక మండలం ఈ.బయ్యారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో తుక్కుగూడ జన జాతర సభను విజయవంతం చేసిన మండల కాంగ్రెస్ పార్టీ నాయకులకు, శ్రేణులకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతూ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శబదం చేసిన విధంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఒక్కరంటే ఒక్కరిని అసెంబ్లీ గేటు తాకానివ్వను అనే మాటను సంపూర్ణం చేస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఒక్కగాని ఒక్క ఎమ్మెల్యే బిఆర్ఎస్ పార్టీ నుండి తెల్లం కాంగ్రెస్ పార్టీలో చేరారన్నారు. బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు తెల్లం వెంకట్రావుపై అనర్హత వేటు వెయ్యాలని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని, రేగా కాంతారావు మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఉందని ఎద్దేవా చేశాడు. ఆనాడు మీరు కాంగ్రెస్ పార్టీ నుండి గెలిచి బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్ళినప్పుడు మీకు ఏ పార్టీ అనర్హత వేటు వేశారని అసలు మీరు మీపై అనర్హత వేటు వేసుకునే దుస్థితికి తీసుకొచ్చారని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నానన్నారు. కర్మఫలం ఎప్పటికీ తిరిగి వెంటాడుతుందని ఆనాడు మీరు చేసిన కర్మఫలం నేడు పినపాక ప్రజలు మీకు ఆ కర్మ ఫలితాన్ని రుచి చూపించారని, ఇకనైనా మీ పద్ధతి మార్చుకోకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. జన జాతర సభ ఇంతలా విజయవంతం అయినందుకు ఓర్వలేక ఇలా మాట్లాడడం తగదని తెలంగాణ రాష్ట్రం ముఖ్యమంత్రిపై మంత్రులపై ఎమ్మెల్యేలపై నోరు ఉంది కదా అని ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఇక్కడ ఊరుకోవడానికి ఏ ఒక్క కాంగ్రెస్ పార్టీ నాయకులు గాని కార్యకర్తలు గాని లేరని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. టిపిసిసి సోషల్ మీడియా కో ఆర్డినేటర్ అచ్చనవీన్, మండల ఉపాధ్యక్షులు అత్తే లక్ష్మణ్, జరుపుల రాము, కల్తీ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా గాంధీ ఎమర్జెన్సీ హాస్పిటల్ మొదటి వార్షికోత్సవం

**కొత్తగూడెం, ఏప్రిల్07(కెరటం ప్రతినిధి)**

గాంధీ ఎమర్జెన్సీ హాస్పిటల్ మొదటి వార్షికోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర రావు, తూము చౌదరి, ఆళ్ళ మురళి, నాగేందర్ త్రివేది, పెదబాబు, చేతుల మీదుగా కేక్ కటింగ్ నిర్వహించారు. జిల్లా చైర్పర్సన్ కంచర్ల మాట్లాడుతూ, గాంధీ ఎమర్జెన్సీ హాస్పిటల్ యాజమాన్యానికి కొన్ని సూచనలు తెలిపారు. 24 గంటలు పేదలకు వైద్యం అందుబాటులో ఉండే విధంగా అతి తక్కువ ఖర్చుతో వైద్యం నిర్వహించేలా చేపట్టాలని యాజమాన్యానికి డాక్టర్కి సూచించారు. హాస్పిటల్ యజమాన్యం ప్రతి శనివారం ఓపీ ఫీజు ఉచితం షుగర్ పరీక్ష ఎఫ్బిఎస్, పిఎల్బిఎస్ ఉచితంగా చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పూనెం శ్రీనివాస్, జిల్లా డిసిసి మైనార్టీ సెక్రటరీ గౌస్ పాషా, కేకే, వాసు, సుందర్లాల్ కోరి, వనమా రాము, సూరిబాబు, అంతర్పుల కృష్ణ, తాటి తిరుమలేష్, హాస్పిటల్ యాజమాన్యం, గుగులోత్ మంగీలాల్, విలాసాగరపు నరేంద్ర షేక్ మదర్, డాక్టర్ రవి డాక్టర్ మురళీకృష్ణ హాస్పిటల్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా

# అభివృద్ధి సాధిద్దాం

- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు
- కూనంనేని సమక్షంలో సిపిఐలో చేరిన ఎంపిటీసి గణేష్
- తాజా మాజీ సర్పంచి మంగమ్మతోపాటు మరో 60 కుటుంబాలు సిపిఐలో చేరిక



**కొత్తగూడెం, ఏప్రిల్07(కెరటం ప్రతినిధి)**

సుజాతనగర్ మండల పరిధిలోని కోమటిపల్లి ఎంపిటిసి మూడు గణేష్ ఆదివారం కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు సమక్షంలో సిపిఐలో చేరారు. ఎంపిటిసి గణేష్తోపాటు కోమటిపల్లి గ్రామానికి చెందిన రాంచందర్, గణేష్ రామచంద్రు, ప్రశాంత్, రాంబాబు, రమేష్, రాజ, భూక్య రాజేష్ హరి, మోహన్, నగేష్, నరేష్, శంకర్ తదితరులు సిపిఐలో చేరినవారిలో ఉన్నారు. గ్రామంలో జరిగిన సిపిఐ ముఖ్యకార్యకర్తల సమావేశం సందర్భంగా వీరు పార్టీలో చేరారు. వీరికి కూనంనేని పార్టీ కండువాను కప్పి ప్రాథమిక సభ్యత్వాన్ని అందించారు. సీతంపేట గ్రామంలో జరిగిన పార్టీ పంచాయతీ స్థాయి సమావేశం సందర్భంగా సీతంపేట తాజామాజీ సర్పంచ్ లావుడియా మంగమ్మ, గ్రామస్తులు గోపి, ప్రసాద్ చౌహాన్, రాజీవ్, హీరాలాల్ లక్ష్మి, మంగ్య, ఉపేందర్, శ్రీను, శ్రీదర్, మల్లాచారి, నరసింహా చారి, దండు సురేష్ బొద్దు కేశవరావు, నరిగద్దె నవీన్ గడ్డం రాములు తదితరులు సిపిఐలో చేరిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ పార్టీలో చేరిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, నాయకత్వ లక్షనాలు ఉన్న వ్యక్తులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించడం ద్వారా అదేవిదంగా వారి సమస్యలను పరిష్కరించాలని తద్వారా పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో తనపై నమ్మకంతోనే ఎమ్మెల్యేగా గెలిపించారని, వారి నమ్మకానికనుగుణంగా నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని, ప్రజా సమస్యలకు పరిష్కారం చూపుతానన్నారు. కార్యక్రమాల్లో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్కెసాబీర్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాసరావు, సలిగంటి శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యులు భూక్య దను, కంచర్ల జమలయ్య, కొమారి హన్మంతరావు, జక్కుల రాములు, భూక్య శ్రీనివాస్, ఎంపిటిసి భూక్య పద్మావతి, నాయకులు తాళ్ళ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



## తుక్కుగూడ జనజాతర
# సభ సూపర్ సక్సెస్

- జనజాతర సభకు ప్రజా ప్రభంజనం
- విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు
- కాంగ్రెస్ పార్టీ పాల్వంచ పట్టణ అధ్యక్షులు నూకల రంగారావు

**కొత్తగూడెం, ఏప్రిల్07(కెరటం ప్రతినిధి)**



హైదరాబాద్లో జరిగిన తుక్కుగూడ జనజాతర సభ సూపర్ సక్సెస్ అయిందని, జనజాతర సభకు లక్షలాది మందితో ప్రజా ప్రభంజనం సాగిందని కాంగ్రెస్ పార్టీ పాల్వంచ పట్టణ అధ్యక్షులు నూకల రంగారావు అన్నారు. పార్లమెంట్కు జరగనున్న ఎన్నికల్లో జాతీయ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో విడుదల కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్లో నిర్వహించిగా, ఈ సభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కాంగ్రెస్ పార్టీ పాల్వంచ పట్టణ అధ్యక్షులు నూకల రంగారావు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... దేశ ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపంగా ఐదు గ్యారంటీలతో మ్యానిఫెస్టోను రూపొందించారన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పార్టీని విశ్వసిస్తున్నారని, గత అసెంబ్లీ ఎన్నికలో హామీలిచ్చిన ఆరు గ్యారంటీలలో నాలుగింటిని ఇప్పటికే నెరవేర్చారని, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు ఖాయమని, సభలో ప్రకటించిన ఐదు గ్యారంటీలను కూడా రాహుల్ గాంధీ నాయకత్వంలో అమలు చేయడం ఖాయమని అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం కార్యకర్తలు అహర్నిశలూ శ్రమించాలని, రాహుల్ గాంధీని ప్రధానిగా చేయడమే కాంగ్రెస్ కార్యకర్తల లక్ష్యంగా ప్రచారం గావించాలని కాంగ్రెస్ పార్టీ పాల్వంచ పట్టణ అధ్యక్షులు నూకల రంగారావు కోరారు.

# ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి

- ఫిర్యాదు చేసి పదిహేను రోజులు గడుస్తున్నా చర్యలెందుకు తీసుకోవడం లేదు
- బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్



**కొత్తగూడెం, ఏప్రిల్07(కెరటం ప్రతినిధి)**

ఎన్నికల కోడ్ ఉల్లంఘించి సమావేశం ఏర్పాటు చేసిన ఎమ్మెల్యేపై వెంటనే చర్యలు తీసుకోవాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అడ్వకేట్ యెర్రా కామేష్ ప్రభుత్వాన్నీ డిమాండ్ చేశారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ గత నెల 23వ తేదీన స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ పార్టీ శ్రేణులు ఎన్నికల నిబంధనలను అతిక్రమించి పాల్వంచ మండలంలోని తోగ్గూడెం,జగన్నాథపురం గ్రామాల్లో అనుమతులు లేకుండా ఎన్నికల కోడ్ ను అతిక్రమించి సమావేశాలు ఏర్పాటు చేశారని ఆరోపించారు.ఎమ్మెల్యే ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని పేపర్ క్లిపింగ్స్,ఫోటోలతో సహా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసి పదిహేను రోజులు గడుస్తున్నా చర్యలు తీసుకోకుండా విచారణ పేరిట కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. తూతూ మంత్రంగా నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకోవాలని చూస్తున్నారని అధికారులు తక్షణమే స్పందించి ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన ఎమ్మెల్యే పై,సిపిఐ పార్టీ నాయకులపై చర్యలు తీసుకోవాలని లేనియెడల హైకోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సందెల సందీప్,తాటిపాముల హరిక్రిష్ణ, ధనుంజయ్, నన్ను తదితరులు పాల్గొన్నారు.




## మాదిగలకు ఇంత అన్యాయమా..?

### మాదిగ జే.ఏ.సి.రాష్ట్ర జనరల్ సెక్రటరీ మోదుగు.జోగారావు

**కొత్తగూడెం, ఏప్రిల్07(కెరటం ప్రతినిధి)**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని విలేకర్లతో మాదిగ జే.ఏ.సి.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోదుగు.జోగారావు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ జీ, రాష్ట్రంలోని మాదిగలందరూ ఆప్ కా పరివార్ హై... అని తెలుపుతూ మరి రాష్ట్రంలో 80 లక్షలుగా అతి పెద్ద కులంగా ఉన్న మాదిగలకు పార్లమెంట్ స్థానాలలో ఒక్క సీటు కూడా ఇవ్వకుండా ఇంత అన్యాయమా అని అడిగినారు. కనీసం సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉప ఎన్నిక అసెంబ్లీ స్థానం కూడా మాదిగలకు ఇవ్వకుండా తీవ్రమైన అన్యాయం జరిగిందని తెలిపినారు. పార్లమెంట్ ఎన్నికల అంతరం మాదిగలను ఓటు బ్యాంక్ గానే చూస్తారా.. లేక నామినేటెడ్ పదవులు మాదిగ జనాభా దామాషా ప్రకారం ఇస్తారా...మీరు నిన్న తుక్కుగుడాలో ప్రకటించిన 5వ న్యాయం సామాజిక న్యాయం పాటిస్తారా లేక ఒక్క వర్గానికే న్యాయం చేస్తారా.... కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయం పాటిస్తూ,మాదిగలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు సామాజిక న్యాయం చేస్తారని,మాదిగలకు రావలసిన వాటాను కల్పిస్తారని ఆశిస్తున్నామని పత్రిక మిత్రులకు తెలిపినారు.



## ముమ్మరంగా టీబీజీకేఎస్ సభ్యత్వ నమోదు

**కొత్తగూడెం, ఏప్రిల్07(కెరటం ప్రతినిధి)**

రామవరం టీబీజీకేఎస్ ఆఫీసు నందు యూనియన్ సభ్యత్వ నమోదు ముమ్మరంగా చేపట్టారు. ఈ సందర్భంగా టీబీజీకేఎస్ నాయకులు కాపు కృష్ణ, కూసాని వీరభద్రం. వారు మాట్లాడుతూ.. టీబీజీకేఎస్ సభ్యత నమోదును కార్మిక సోద రులు అందరు కూడా తీసుకోగలరని, టీబీజీకేఎస్ రికాగ్నైజ్ యూనియన్‌గా ఉన్న ప్పుడు కార్మికులకు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు అనేకం చేయడం జరిగిందని తెలిపారు. రాబోయే కాలంలో కూడా కార్మికులకు సంక్షేమం కొరకు పని చేస్తామని తెలిపారు. టిబిజికేఎస్ నాయకులు గడప రాజయ్య, ఆంజనేయులు, విజయ్ కుమార్,వెంకటేశ్వర్లు,తిరుపతి, సూరిబాబు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



## మెట్టు సాయికుమార్‌కు ఘన సత్కారం

**హైదరాబాద్, ఏప్రిల్07(కెరటం ప్రతినిధి)**

ప్రాథమిక మత్స్య సహకార సంఘం సబ్జీమండిలో తెలంగాణ మత్స్య సహకార ఫిషరీస్ కోఆపరేటివ్ సొసైటీ సమైక్య లిమిటెడ్ చైర్మన్‌గా మెట్టు సాయికుమార్‌ని ఎన్నుకున్న సందర్భంగా సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మెట్టు సాయికుమార్‌ని, హైదరాబాద్ మత్స్య శాఖ చైర్మన్ కొప్పు పద్మని మిగిలిన సొసైటీ సభ్యులను, సంఘ సభ్యులను సన్మానించడం జరిగినది. ఈ సన్మానం ప్రాథమిక మత్స్య సహకార సంఘం సబ్జీ మండి అధ్యక్షులు కట్ట లింగం, ప్రధాన కార్యదర్శి మురారి రాంబాబు, ఉపాధ్యక్షులు మంగిలిపల్లి బాల నరసింహ, కోశాధికారి చేర్క బాబు, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ గుడుమని అభిమన్యు, కట్ట స్వామి, కుడుముల కుమార్, బాద రమేష్, చెర్క అరవింద్ కుమార్, సొసైటీ సహాయకులు పూస శేఖర్, పూస లక్ష్మీనారాయణ,గుర్రం రవి. పూస నరేందర్ చెర్క ఆనంద్ కుమార్. చెర్క రాఘవతో పాటు సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.



# ప్రీతి అడుసుమిల్లికి కార్పొరేట్
# క్వీన్ మిసెస్ ఇండియా కిరీటం

- యువత సాధికారతే లక్ష్యంగా సిసిరో అకాడమీ ప్రారంభం
- మొదటి పది మందికి రూ.3 లక్షల కోర్సు ఉచితం







హైదరాబాద్, ఏప్రిల్ 7, 2024: ప్రతిష్టాత్మకమైన కార్పొరేట్ క్వీన్ మిసెస్ ఇండియా 2024, క్లాసిక్ మిసెస్ ఇండియా 2024 క్రౌన్ విన్నర్ కిరీటాన్ని డాక్టర్ ప్రీతి అడుసుమిల్లి పొందారు. మిసెస్ ఇండియా పేజెంట్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు ఇటీవల గుర్గ్రాన్లో జరిగాయి. జాతీయ పోటీలలో తెలంగాణ రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించిన డాక్టర్ ప్రీతి అడుసుమిల్లి సెప్టెంబర్ 2023లో మిసెస్ ఇండియా తెలంగాణ రన్నరప్గా నిలిచారు. మిసెస్ ఇండియా అనేది వివాహిత మహిళలకు ఇచ్చే గౌరవనీయమైన బిరుదు. ఇది తమను తాము వ్యక్తీకరించుకోవడానికి ఒక వేదికగా నిలుస్తుంది. డెజాంజ్ సెలూన్, స్పా, కామిల్లె అల్బేన్ వంటి అంతర్జాతీయ ప్రసిద్ధ మేక్ఓవర్ బ్రాండ్లతో విజయవంతంగా భాగస్వామ్యం చేయడంలో ఆమె అత్యుత్తమ వ్యాపార చతురత, విశేషమైన విజయాలను గుర్తించింది.

**యువత సాధికారతే లక్ష్యంగా సిసిరో అకాడమీ**

యువత సాధికారత లక్ష్యంగా సిసిరో అకాడమీ పని చేయనున్నట్లు డాక్టర్ ప్రీతి అడుసుమిల్లి తెలిపారు. మాదాపూర్ లోని కావేరి హిల్స్లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ ప్రతిష్టాత్మక గుర్తింపు నా ఆశయాలకు ఆజ్యం పోసిందన్నారు. నా కలలు సాకారం దిశగా పయనించేందుకు శక్తినిస్తుందన్నారు. మహిళల జీవితాలను మెరుగుపరచడానికి, సమాజానికి నా వంతు కృషి చేయడానికి ఎప్పుడూ ప్రయత్నం చేస్తూ ఉంటానన్నారు. యువతరానికి టైర్ 2, టైర్ 3 పట్టణాలకు చెందిన వారికి మేక్ఓవర్, గ్రూమింగ్ వృత్తిలో నైపుణ్యం కల్పించడానికి ప్రేరణ ఇస్తుందన్నారు. ఈ లక్ష్యాన్ని నెరవేర్చడానికి నేను అకాడమీని ఏర్పాటు చేస్తున్నానని చెప్పారు.

డాక్టర్ ప్రీతి ప్రారంభించిన ఈ 'సిసిరో అకాడమీ' మహిళలను మేక్ఓవర్, గ్రూమింగ్ ప్రొఫెషనల్స్గా తయారు చేసే శిక్షణా సంస్థ. హెయిర్ స్టైలిస్ట్, బ్యూటీషియన్, అడ్వాన్స్ కాస్మోటాలజీలో గ్లోబల్ కెరీర్ను కొనసాగించేందుకు టైర్ 2, టైర్ 3 నగరాల్లోని విద్యార్థులకు ప్రపంచ స్థాయి అంతర్జాతీయ స్థాయి శిక్షణతో పాటు ధృవీకరణ పత్రాన్ని అందించాలనే లక్ష్యం ఉంది. ఈ కోర్సులు మార్కెట్ ధర కంటే యాభై శాతం తగ్గింపులో ఉంటాయి. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రఖ్యాత ఈ ట్రైనర్లను సోర్సింగ్ చేస్తుంది. ఆన్లైన్ శిక్షణ నుంచి ప్రఖ్యాత శిక్షకులతో ప్రపంచ స్థాయి సెటప్తో ఆఫ్లైన్ హ్యాండ్ ఆన్ శిక్షణ కూడా ఉంటుంది. 30 రోజుల కోర్సు నుంచి మూడు సంవత్సరాల డిప్లొమా కోర్సు వరకు కలదు. అధునాతన కాస్మోటాలజీ కోర్సులు, డెంటల్ అసిస్టెంట్, హెయిర్, స్కిన్, మేకప్ ఆర్టిస్ట వరకు విద్యార్థులకు శిక్షణ ఇవ్వనుంది. మే 1, 2024 నుంచి ఈ కోర్సులు హైదరాబాద్ సిసిరో అకాడమీలో ప్రారంభం కానున్నాయి. అకాడమీ నుంచి ఉత్తీర్ణత సాధించిన విద్యా ర్థులు వ్యవస్థాపకులు కావచ్చు, ప్రసిద్ధ సెలూన్లలో ప్లేస్మెంట్ పొందవచ్చు, విదేశాలలో ఉపాధి కూడా పొందవచ్చు. పేద కుటుంబాలకు చెందిన మొదటి పది మంది విద్యార్థులకు సిసిరో అకాడమీ రూ. 3 లక్షల విలువైన కోర్సును ఉచితంగా అందజేస్తుంది. ఆసక్తి ఉన్న విద్యార్థులు సిసిరో అకాడమీని 72077 83322 నెంబర్లో సంప్రదించగలరు.

చెన్నైలో డాక్టర్ ప్రీతి అడుసుమిల్లి జన్మించారు. హైదరాబాద్లో స్థిరపడ్డారు. కళాకారిణి, విద్యావేత్త, సీరియల్ వ్యవస్థాపకురాలు, క్రీడా ప్రియురాలు, సాంస్కృతిక రాయబారి, పరోపకారి. ఆమె క్లాసికల్ భరతనాట్యం డాన్సర్, శిక్షణ పొందిన కాస్మోటాలజిస్ట్, గోల్డ్ మెడలిస్ట్, బెస్ట్ అవుట్గోయింగ్ స్టూడెంట్ అవార్డు గ్రహీత. బహుముఖ ప్రజ్ఞాశాలి. డాక్టర్ ప్రీతి ఓరల్ క్యాన్సర్ నివారణలో నిపుణురాలు. ఎండీఎస్ చేశారు. ప్రొఫెసర్గా పనిచేశారు. డెసాంజ్, కామిల్లె అల్బేన్ సెలూన్లలో పదవులను కలిగి ఉన్నారు. డాక్టర్ ప్రీతికి ఇద్దరు టీనేజ్ పిల్లలు ఉన్నారు.

సమాజానికి ఏదో చేయాలన్న తపనతో డాక్టర్ ప్రీతి గ్రామీణ ప్రాంతాల్లోని వెనుకబడిన వారి కోసం వెయ్యికి పైగా ఉచిత దంత శిబిరాలు నిర్వహించారు. జాతీయ వేదికపై కొండపల్లి బొమ్మల గురించి అవగాహన కల్పించారు. తెలంగాణకు చెందిన పోచంపల్లి చీరలు, రాగి సంకటి వంటలను ప్రచారం చేశారు.

మిసెస్ ఇండియా తెలంగాణ రీజినల్ డైరెక్టర్ మమతా త్రివేది, మిసెస్ ఇండియా నేషనల్ డైరెక్టర్ దీపాలి ఫడ్నిస్ సపోర్ట్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రయాణంలో సహకరించిన స్నేహితులు, బంధువులకు కూడా కృతజ్ఞతలు తెలిపారు. మిసెస్ ఇండియా తెలంగాణ రీజినల్ డైరెక్టర్ మమతా త్రివేది మాట్లాడుతూ మిసెస్ ఇండియా తెలంగాణాలో పాల్గొన్నప్పటి నుంచి ఆమె కృషి ఎనలేనిదన్నారు. జాతీయ స్థాయిలో రాష్ట్రం గర్వపడేలా ఆమె సాధించిన విజయాలకు అభినందించారు.

**మిసెస్ ఇండియా తెలంగాణ గురించి**

మిసెస్ ఇండియా తెలంగాణ అనేది మిసెస్ ఇండియాలో భాగం కావడానికి, జాతీయ స్థాయిలో తెలంగాణకు ప్రాతినిధ్యం వహించడానికి ఏర్పాటైంది. తెలంగాణలోని వివాహిత మహిళలకు ఇది ఒక గేట్వే. మిసెస్ ఇండియా తెలంగాణ రీజినల్ డైరెక్టర్ మమతా త్రివేది 2018 నుంచి రాష్ట్ర స్థాయిలో పోటీని నిర్వహిస్తున్నారు. టూరిజం రౌండ్, నేషనల్ కాస్ట్యూమ్ రౌండ్, టాలెంట్ రౌండ్, రెట్రో రౌండ్, ఫిట్నెస్ వంటి బహుళ రౌండ్లలో పాల్గొనే వారితో ఈ పోటీ నిర్వహించబడింది. రౌండ్, ఫుడ్ కనెక్ట్ రౌండ్, గ్లిట్జ్ %ు% గ్లామ్ రౌండ్, యాంగిల్స్ రౌండ్, ఫ్యాషన్ రౌండ్, ప్యాషన్ రౌండ్, డ్యాన్స్ రౌండ్, క్యూఎన్ఏ రౌండ్ కలవు.

---

# పిచ్చుక గూళ్ళను నిర్మిద్దాం
# పక్షి జాతిని రక్షిద్దాం..

- మొక్కల రాజశేఖర్ అభినందనీయులు
- టిజిఓస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షులు సంగం వెంకట పుల్లయ్య





**కొత్తగూడెం, ఏప్రిల్07(కెరటం ప్రతినిధి)**

వన్యప్రాణుల పిచ్చుక గూళ్ళని పంపిణీ చేస్తున్న మొక్కల రాజశేఖర్ అభినందనీయులు అని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ అశ్వరావుపేట, టిజిఓస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షులు, అసోసియేషన్ ఆఫ్ ట్రాన్స్పోర్ట్ డిపార్ట్మెంట్ టెక్నికల్ ఆఫీసర్స్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు సంగం వెంకట పుల్లయ్య కొనియాడారు. ఆదివారం మొక్కల రాజశేఖర్ సంగం వెంకటపుల్లయ్య స్వగృహానికి వెళ్లి పిచ్చుక గూళ్లను, ధాన్యం గింజలను, నీటి సౌకార్యనికి పాత్రలను అందజేశారు. ఈ సందర్భంగా వెంకటపుల్లయ్య మాట్లాడుతూ..ప్రపంచ పర్యావరణ పరిరక్షణ కొరకు "వినూత్న స్వచ్ఛంద ప్రకృతి సేవా, ప్రచార కార్యక్రమాలు" చేస్తున్న మొక్కల రాజశేఖర్ ప్రకృతిని రక్షించే వన్యప్రాణులు సంరక్షణ కోసం వన్యప్రాణులైన ఊర పిచ్చుకలు, వివిధ పక్షుల జంతువుల, జీవవైవిధ్య సంరక్షణ కోసం విశేష కృషి చేస్తున్నారని తెలిపారు. అడవుల శాతం తగ్గటం వల్ల, సెల్ టవర్స్ వలన, కాలుష్యం వలన వన్యప్రాణుల సంఖ్య చాలా తగ్గి అంతరించిపోయే ప్రమాదంలో ఉన్నామయని, వాతావరణాన్ని తట్టుకొని కొన్ని పక్షి జాతులు పెట్టుకున్నటు వంటి గూళ్ళను కోతులు ఆగంచేసి వాటిలో వున్న పిచ్చుక పిల్లలను, గుడ్లను తినటం వలన పక్షి జాతి మనుగడ ప్రశ్నార్ధకం వున్నదని, అందుకు నివారణగా ప్రతి ఒక్కరికీ స్వచ్ఛందంగా పిచ్చుక గూళ్లను, ఆహారం కొరకు ధాన్యం గింజలను, నీటి సౌకర్యాలను కల్పించేందుకు చేస్తున్న కృషి అనిర్వచనీయమన్నారు. ఈ ప్రచారాన్ని గుర్తించి వందలాది మంది వేలాది పిచ్చుక గూళ్లను తెప్పించుకొని వారి ఇంటి చూర్ల కింద పెడుతున్నారని, ప్రతి ఒక్కరు కూడా రాజశేఖర్ని స్ఫూర్తిగా తీసుకోవాలని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ అశ్వరావుపేట, టిజిఓస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షులు, అసోసియేషన్ ఆఫ్ ట్రాన్స్పోర్ట్ డిపార్ట్మెంట్ టెక్నికల్ ఆఫీసర్స్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు సంగం వెంకట పుల్లయ్య కోరారు.